క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

పెద్దారవీడు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో ఎంపీపీ బెజవాడ పెద్ద గురవయ్య అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాజ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. సమావేశానికి జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల స్థాయి అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలతో తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

పరీక్షల్లో మెరిట్ సాధించాలి

కురిచేడు: విద్యార్థినులు 10, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ధైర్యంగా రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని జిల్లా బాలికల అభివృద్ధి అధికారి ఎం.ప్రమోద సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులనుద్దేశించి మాట్లాడుతూ పట్టుదలతో శ్రద్ధగా చదవాలన్నారు. రాష్ట్ర సర్వశిక్ష అభియాన్ సంచాలకులు ప్రత్యేకంగా పంచతంత్ర పేరుతో విద్యార్థినులకు ఉచితంగా మెటీరియల్ అందజేసినట్లు తెలిపారు. దానిఆధారంగావిద్యార్థినులు పూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. ప్రిన్సిపాల్ ఎస్. పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.

కొండేపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

మార్కాపురం రూరల్: మండలంలోని కొండేపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తిప్పాయపాలెం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్ నాయక్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం రెండో విడతను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎల్.శేఖర్, సూపర్‌వైజర్ రూత్‌మేరీ, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, ఏఎస్ఎం పద్మ సరోజినీ అరుణ, సచివాలయ సిబ్బంది, ఏఎస్ఎంలు పాల్గొన్నారు.

జగనన్న సురక్షకు విశేష స్పందన

కొమరోలు: స్థానిక గ్రామ సచివాలయంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని వైస్ ఎంపీపీ షేక్ మాలాలీ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి డాక్టర్ చైతన్య దీపక్ ఆధ్వర్యంలో క్యాంపు నిర్వహించగా కొమరోలు–2 గ్రామ సచివాలయ పరిధిలోని ప్రజలు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకున్నారు. వివిధ రకాల స్పెషలిస్టులు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ప్రభుత్వ రాయితీలతో మహిళల ఆర్థికాభివృద్ధి



ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎల్‌డీఎం అబ్దుల్ రహీం, సర్పంచ్ నాగేంద్రం

ముండ్లమూరు: మహిళలు ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ అబ్దుల్ రహీం అన్నారు. మండలంలోని పెద ఉల్లగల్లులో రూ.14 లక్షలతో ఏర్పాటు చేసిన నూతన ఐస్‌క్రీం తయారీ యూనిట్‌ను ఆయన శుక్రవారం సాయంత్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ, యువకులకు ఉపాధి అవకాశాల ద్వారా జీవన విధానాన్ని మెరుగు పరుచుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆర్థిక సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ఆహార ఉత్పత్తులు, వ్యాపారాలను ప్రోత్సహిస్తూ 35 శాతం రాయితీతో రుణం అందజేయనున్నట్లు చెప్పారు. అందులో భాగంగా ఆశక్తి ఉన్న అన్ని వర్గాల వారికి ఈ అవకాశం వర్తిస్తుందన్నారు. పెద ఉల్లగల్లు ఎస్సీ కాలనీకి చెందిన దార్ల యాదమ్మ కుటుంబ సభ్యులకు డీఆర్‌డీఏ- వైఎస్సార్ క్రాంతి పథం ప్రోత్సాహంతో కెనరా బ్యాంకు సహకారంతో రూ.14 లక్షలతో ఐస్‌క్రీం తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువతకు డీబీఆర్‌సీ ప్రతినిధులు అండగా ఉండి వారిని చైతన్య పరచడంతో వారి పాత్ర కీలకమన్నారు. రూ.10 లక్షల బ్యాంకు రుణం, ఉన్నతి పథకం ద్వారా మూడు లక్షల వడ్డీలేని రుణం, లక్షల రూపాయల సొంత నిధులతో ఏర్పాటు చేసిన యూనిట్ ద్వారా మండలంలోని అనేక మంది ఐస్‌క్రీం వ్యాపారులకు లబ్ధి చేకూరుతుందన్నారు. డీపీఎం డేవిడ్ మాట్లాడుతూ ఐస్‌క్రీం అమ్మకందారులు గతంలో విజయవాడ వెళ్లి ముడి సరుకులు తెచ్చుకోవాల్సి ఉండేదన్నారు. దీంతో ఖర్చు అధికంగా ఉండడంతో పాటు ప్రయాణభారం ఉండేదన్నారు. గ్రామంలో ఐస్‌క్రీం తయారు కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా 50 కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందన్నారు. యూనిట్‌లో పరో పది మందికి ఉపాధి కల్పించినట్లు చెప్పారు. వ్యాపారం పట్ల ఆశక్తి ఉన్న ప్రతి ఒక్కరికి రుణం ఇచ్చేందుకు కెనరా బ్యాంకు ముందుకు వస్తున్నందున, అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానంగా ఎస్సీ, ఎస్టీలకు 35 శాతం నుంచి 45 శాతం వరకు రాయితీ రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం సర్పంచ్ జనమాల నాగేంద్రంతో కలిసి నూతన తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. బ్యాంకు లింకేజీ డీపీఎం బత్తుల సుబ్బారావు, దర్శి క్లస్టర్ ఏరియా కో ఆర్డినేటర్ వసుంధరాదేవి, డీబీఆర్‌సీ జిల్లా కార్యదర్శి దార్ల కోటేశ్వరరావు, మండల కార్యదర్శి వెంకటరావు, ఏపీఎం హనుమంతరావు, మండల సమాఖ్య ప్రతినిధులు కుంటా పేరమ్మ, గ్రామ సంఘ అధ్యక్షురాలు కత్తి శారమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.






సీఎం జగన్‌కు ఘన స్వాగతం




ఒంగోలు: పేదలకు నివేశన స్థలాల పంపిణీ కోసం శుక్రవారం ఒంగోలు వచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు నాయకులు ఘన స్వాగతం పలికారు. సీఎంకు స్వాగతం పలికిన వారిలో గిద్దలూరు నేత చేగిరెడ్డి లింగారెడ్డి, ఆదిమూలపు విశాల్, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, బేస్తవారిపేట ఎంపీపీ ఓసూరారెడ్డి, కొనకనమిట్ల వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, వెన్నా హనుమారెడ్డి, వెన్నా ఇందిర ఉన్నారు.

మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలి



కలివెలపల్లిలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న బూచేపల్లి వెంకాయమ్మ, శివన్న



వెంకాయమ్మ, శివన్నను గజమాలతో సత్కరిస్తున్న సర్పంచ్

- డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి

దొనకొండ: రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండి నేరుగా సంక్షేమం, అభివృద్ధి పథకాలు సక్రమంగా కొనసాగించి రాష్ట్రం చల్లగా ఉండాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలని దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని వద్దిపాడు, కలివెలపల్లి గ్రామాల్లో శుక్రవారం మన ఊరికి మన శివన్న కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రజలతో మమేకమయ్యారు. వద్దిపాడులో మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాదయాత్రలో ఇచ్చిన హామీలు నూటికి నూరు శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. సంక్షేమాలు లబ్ధిదారులకు దళారుల వ్యవస్థతో సంబంధం లేకుండా వలంటీర్లు నేరుగా అందించారన్నారు. మళ్లీ పథకాలు కొనసాగాలంటే తాను ఎమ్మెల్యేగా జగనన్న ముఖ్యమంత్రిగా ఉండాలన్నారు. మాట మీద నిలబడే కుటుంబం వైఎస్ కుటుంబం అని, అలాంటి కుటుంబాన్ని మనం ఎప్పుడూ మరిచిపోవద్దని నాయకులు, కార్యకర్తలకు శివన్న పిలుపునిచ్చారు. చంద్రబాబు హామీలిచ్చి కుర్చీలో కూర్చుని పేదలను మరిచిపోయారని, జగనన్న అలా కాకుండా నా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అంటూ ముందుకు సాగుతున్నారన్నారు. బాబుకు జగనన్నను ఎదురించే సత్తా లేదని శివన్న ఎద్దేవా చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ వెంకాయమ్మ మాట్లాడుతూ కలివెలపల్లెకు జిల్లా పరిషత్ నిధుల నుంచి రూ.40 లక్షలతో మంచి నీటి ట్యాంక్ ఏర్పాటు చేసి ఇంటింటికీ కొళాయి సౌకర్యం కల్పించామన్నారు. అభివృద్ధే తమ కుటుంబ లక్ష్యమని, 2004లో బూచేపల్లి సుబ్బారెడ్డిని ఇండిపెండెంట్‌గా గెలిపించారని, నాటి నుంచి నేటి వరకు తమ కుటుంబం ప్రజలతో కలిసి మెలిసి ఉంటుందని, ప్రజల సమస్యలు పరిష్కరించటమే తమ ధ్యేయమన్నారు. తన బిడ్డ శివన్న ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారని మీ పవిత్రమైన ఓటును వేసి గెలిపించాలని, అదే విధంగా ఒంగోలు పార్లమెంట్‌కు చెవిరెడ్డి భాస్కరరెడ్డి పోటీ చేస్తున్నారని ఆయనకు మరో ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. మన గుర్తు ఫ్యాను గుర్తు అని, మీరు ఎప్పుడూ మరిచి పోవద్దని వెంకాయమ్మ తెలిపారు. దొనకొండ పట్టణ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి సుమారు 100 బైకులతో ర్యాలీగా వద్దిపాడుకు మన ఊరు మన శివన్న కార్యక్రమానికి బయల్దేరి వెళ్లారు. మండల ఇన్‌చార్జి కాపా రమణారెడ్డి, ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి, మాజీ కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, కర్నాటి ప్రసన్నాంజనేయరెడ్డి, సర్పంచ్ నూనె సరోజా వెంకటరెడ్డి, బత్తుల వెంకట సుబ్బయ్య యాదవ్, పి.మూర్తయ్య, బాపనపల్లి శ్రీను, పున్నయ్య, షేక్ గఫార్, గొంగటి మహేష్‌రెడ్డి, గుంటు అమ్మాజీ అజయ్, తాల్లూరి లక్ష్మీ నగేష్, కసిబిసి నాగరాజు, ముజాయిద్, ఇమ్రాన్‌ఖాన్, విప్పర్ల చిన్న మల్లయ్య, సలీమ్, వెన్నపూస చెంచిరెడ్డి పాతకోట కోటిరెడ్డి, పత్తికొండ వెంకట సుబ్బయ్య, తమ్మనేని సుబ్బారెడ్డి, గొంగటి పోలిరెడ్డి నూనె రామచంద్రారెడ్డి, చీరాల ఇశ్రాయేలు, ఐలూరి శ్రీనివాసరెడ్డి, పెసల చిన్న నారాయణరెడ్డి, వెర్రి ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

నీటి ట్యాంకర్ల బిల్లులు మంజూరు చేయాలి



సీఎం జగన్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

పెద్దారవీడు: మండలంలో ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా పెండింగ్ బిల్లులు మంజూరు చేయించాలని ఒంగోలులో శుక్రవారం జరిగిన ఇంటి పట్టాల కార్యక్రమంలో భాగంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, ఎంపీపీ బెజవాడ పెద్దగురవయ్య, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరాను ఆపకుండా కొనసాగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నీటి బిల్లులు మంజూరు చేయాలని, గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీటి ట్యాంకర్లను ఆపకుండా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను ఆదేశించినట్లు వారు తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం అంకురార్పణతో వైభవంగా ప్రారంభమయ్యాయి. సాయంత్రం ఎదుర్కోలు కార్యక్రమం నిర్వహించారు. శనివారం కల్యాణోత్సవం, హంసవాహనం, ఆదివారం సింహవాహనం, సోమవారం శేష వాహణం, మంగళవారం హనుమంత వాహనం, బుధవారం గరుడవాహనం, గురువారం గజ వాహనం, శుక్రవారం సాయంత్రం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ రావు, ఈఓ చెన్నకేశవరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రోజూ సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. తర్లుపాడుతోపాటు నాయుడుపల్లి, మీర్జపేట, గొల్లపల్లి, తాడివారిపల్లి, నాగేళ్లముడుపు, తుమ్మలచెరువు తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు రమణాచారుల్యు, భార్గవరామాచార్యులు, వంశీకృష్ణాచార్యులు, రమణ్యులు శాస్త్రోక్తంగా క్రతువులు నిర్వహించారు.

దేవస్థానం జీర్ణోద్ధరణకుగాను టీటీడీ నుంచి 25 లక్షల రూపాయలు మంజూరయ్యాయి. పనులు వేగవంతంగా సాగుతున్నట్లు ఎంపీపీ భూలక్ష్మి రామ సుబ్బారెడ్డి, సర్పంచ్ పి.వరాలు, ఎంపీటీసీ అంకమ్మ, వైస్ సర్పంచ్ సత్యానారాయణ రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు అక్బర్ అలీ తెలిపారు.

ఒత్తిడిని జయిస్తేనే విజయం

కొనకనమిట్ల: చదువే భవితకు మూలమని, ఒత్తిడిని జయిస్తే విజయం తథ్యమని గొట్లగట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ రాఘవ సురేఖ పేర్కొన్నారు. శుక్రవారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఇంటర్, 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ ఫంక్షన్ నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి విగ్రహానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఇంటర్, పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ చాటాలని ప్రిన్సిపాల్ ఆకాంక్షించారు. అనంతరం 9, 10, ఇంటర్ విద్యార్థులు బహుమతులు అందిపుచ్చుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ గాడ్గే బాబా జయంతి

మార్కాపురం రూరల్: సంత్ గాడ్గేబాబా 148వ జయంతిని శుక్రవారం మార్కాపురం పట్టణంలో రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాలలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి తిరుపతయ్య మాట్లాడుతూ.. ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన స్వచ్ఛభారత్ కార్యక్రమానికి ప్రేరణ గాడ్గే బాబా అని పేర్కొన్నారు. మహారాష్ట్ర వ్యాప్తంగా 150 పాఠశాలలు, ధర్మశాలలు, శరణాలయాలు, గోశాలలు, ఆసుపత్రులు, వసతి గృహాలు నిర్మించారన్నారు. గంగానదీ పూర్తి శుభ్రత, కాలుష్య రహిత నదీగా చూడాలనేది ఆయన కల అన్నారు. కార్యక్రమంలో రాజా శ్రీకాంత్, సురభి లక్ష్మయ్య, కనిగిరి బాల వెంకటరమణ, టీవీ కాశయ్య, రాచకొండ వెంకటేశ్వర్లు, పొలిశెట్టి నాగార్జున, కనిగిరి పవన్, కంచర్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఏపీజీబీ ఉద్యోగుల సమ్మె

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీజీబీ(ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు) ఉద్యోగులు శుక్రవారం సమ్మె చేశారు. ఈ సందర్భంగా సంఘం ప్రాంతీయ కార్యదర్శి ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ దేశంలోని అన్ని గ్రామీణ బ్యాంకులను స్టేట్ వైడ్ చేస్తూ, జాతీయ గ్రామీణ బ్యాంకు ఏర్పాటు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షుడు ఆదినారాయణ మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనాన్ని సాధించుకున్నామని అయితే ఈ నాటికీ ఇది సాధ్యం కాలేదన్నారు. బ్యాంకు యాజమాన్యాలు ఇప్పటికైనా వివక్షపూరిత ధోరణి విడిచిపెట్టాలన్నారు. సంఘం నాయకులు సందీప్, వేణుగోపాల్, కృష్ణ, సుమన్ తదితరులు మాట్లాడుతూ 2018 వరకూ గ్రామీణ బ్యాంకుల్లో ఉన్న అందరి ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని అమలుచేయాలని సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, యాజమాన్యాలు మాత్రం 2010 వరకు ఉన్నవారికి మాత్రమే అమలు చేశాయన్నారు. మిగిలిన వారికి కూడా పాత పెన్షన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాత్కాలిక ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని మహిళా ప్రతినిధి సమీరా కోరారు. అనంతరం బ్యాంక్ రీజినల్ మేనేజర్ శ్రీనివాసప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ప్రసన్న, ఎస్‌కె ఖాశీం, రఫీ, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

కంభాలపాడులో వైద్య శిబిరం



మందులు అందజేస్తున్న సిబ్బంది

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కంభాలపాడు గ్రామంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శరత్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. గ్రామంలో జ్వరాలు, అనారోగ్యంతో ఉన్న వారిని పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీహెచ్ఓ మహబూబ్ సుబాని, ఏఎన్ఎం రోశమ్మ, రమాదేవి, పద్మ, తిరుపతమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త ప్రజావతి తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొన్న ఆటో



ఆటోను ఢీకొట్టడంతో దెబ్బతిన్న కారు

కంభం: నీటి బబుల్స్‌తో వెళ్తున్న ఆటో వేగంగా వెళ్తూ కారును ఢీకొట్టడంతో పాటు పక్కనే ఆపి ఉన్న మరో వాహనాన్ని ఢీకొట్టిన సంఘటన శుక్రవారం ఉదయం కందులాపురం సెంటర్‌లో జరిగింది. ప్రమాదంలో కారు ఓ వైపు మొత్తం నుజ్జునుజ్జయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆటో డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

25న విశ్వబ్రాహ్మణుల సమావేశం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో ఈ నెల 25వ తేదీన విశ్వబ్రాహ్మణుల సమావేశం నిర్వహించనున్నట్లు ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు చెన్నుపల్లె శ్రీనివాసాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గిద్దలూరు మండలం విశ్వబ్రాహ్మణుల సంఘ అధ్యక్షుడిగా మునుపాటి వీరభద్రాచారి ఎన్నికైన సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. విశ్వబ్రాహ్మణులు తప్పకుండా హాజరు కావాలని ఆయన కోరారు.

వైభవంగా కళ్యాణం

కురిచేడు: గోపయ్య, లక్ష్మీతిరుపతమ్మ కళ్యాణం మండలంలోని అన్ని ఆలయాల్లో శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్న సంతర్పణ నిర్వహించారు. సాయంత్రం స్వామివార్ల కళాణం, గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం తిలకించారు.



ప్రభ నుంచి ప్రసంగిస్తున్న వై.పాలెం ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన సీఎం జగన్

- వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్

త్రిపురాంతకం: ప్రజలకు అభివృద్ధి–సంక్షేమ ఫలాలు అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి..అని, ఆయనకు మనమంతా మద్దతుగా నిలిచి తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌చార్జి తాటిపర్తి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని వెల్లంపల్లిలో ఆంజనేయస్వామి తిరునాళ్ల సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలపై నుంచి ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతం సస్యశ్యామలంగా విరాజిల్లేందుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నాగార్జున సాగర్ కాలువలను ఆధునికీకరించి అభివృద్ధి చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రారంభించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జాతికి అంకితం చేయనున్నట్లు వివరించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. సంక్షేమ పథకాలను మధ్యవర్తి ప్రమేయం లేకుండా ప్రజలకు నేరుగా అందించినట్లు పేర్కొన్నారు. ఇప్పటి వరకు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, విలేజి క్లినిక్‌లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో తాగునీటి సమస్యపై క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశానన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూసేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రజలను మభ్య పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. వారికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాల్సిన అవసరం ఉందని చంద్రశేఖర్ సూచించారు. తనకు యర్రగొండపాలెం నియోజకవర్గ ప్రజలు స్వాగతం పలికిన తీరును జీవితాంతం గుర్తుంచుకుంటానని, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథాన నడిపిస్తానని చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, మండల పార్టీ కన్వీనర్ ఎస్.పోలిరెడ్డి, బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య యాదవ్, మండల సచివాలయ కన్వీనర్ చల్లా యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్ రెడ్డి, బద్ధిగం వెంగళరెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ ఆళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ ఏలియా, ఎంపీటీసీ సిద్ధయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల శ్రీనివాసరెడ్డి, దుగ్గెంపూడి వెంకటరెడ్డి, పి.మల్లికార్జున్, భవనం వెంకటరెడ్డి, బాలకోటిరెడ్డి, ముసలారెడ్డి, ఎస్.సుబ్బారావు, రంగబాబు, గుమ్మా గురవయ్య, ఏసేబు తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి చంద్రశేఖర్‌ను గజమాలతో గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

మార్కాపురం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి



ఎమ్మెల్యే రాంబాబు, చైతన్యను సన్మానించిన పార్టీ నాయకులు

- కౌన్సిలర్ల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే అన్నా

మార్కాపురం: మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని, రానున్న ఎన్నికల్లో తన విజయానికి సహకరించాలని ఎమ్మెల్యే అన్నా రాంబాబు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం రాత్రి స్థానిక మార్కెట్ యార్డులో కౌన్సిలర్లు, ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో మార్కాపురం నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు వచ్చానన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున పార్టీ శ్రేణులంతా కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన ఆవశ్యకతను ప్రజలకు వివరించాలని సూచించారు. గడచిన ఐదేళ్ల కాలంలో గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గాలు చాలా అభివృద్ధి చెందాయన్నారు. ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకుని రావాలని కార్యకర్తలు, నాయకులను కోరారు. కౌన్సిలర్లందరూ తమ వార్డుల్లో ప్రజలతో మమేకమై జగనన్న చేసిన మంచిని వివరించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసేలా చూడాలని కోరారు.

ఆత్మీయ సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఏఎంసీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాల మురళీకృష్ణ, వైస్ చైర్మన్ పి.మురళీ, డైరెక్టర్లు డాక్టర్ మగ్బుల్‌బాషా, పీఎల్‌పీ యాదవ్, రంగస్వామిగౌడ్, సురేష్, నరసింహారెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రంగారెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే కుమారుడు అన్నా కృష్ణచైతన్య పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేసి సన్మానించారు. ఎంఎస్ఎంఈ కార్పొరేషన్ డైరెక్టర్ మేడా బద్రీనాథ్, వైస్ చైర్మన్ 2 అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్లు జి.సుబ్బారెడ్డి, జి.శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు సలీమ్, షెక్షావలి, మండల కోఆప్షన్ సభ్యులు షేక్ మహమ్మద్ రఫీ, పార్టీ ప్రధాన కార్యదర్శి బొగ్గరపు శేషయ్య, కరీముల్లా, ఆసీఫ్‌ఖాన్, షేక్ షెక్షావలి, తర్లుపాడు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షులు మురారి వెంకటేశ్వర్లు, దొంత నాగరాజు గౌడ్, సర్పంచ్ వెన్న సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెన్నాతో ఎమ్మెల్యే అన్నా సమావేశం



వెన్నా హనుమారెడ్డితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, ఏపీ పొల్యూషన్ బోర్డు సభ్యుడు వెన్నా హనుమారెడ్డిని ఆయన నివాసంలో మార్కాపురం వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు సమావేశమయ్యారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో తన గెలుపునకు సహకరించాలని ఎమ్మెల్యే రాంబాబు విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంగా చేసుకునేందుకు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. వెన్నా మాట్లాడుతూ.. మనస్ఫూర్తిగా మీ విజయానికి సహకరిస్తానన్నారు. ఇప్పటి వరకు పార్టీ అభివృద్ధికి కృషి చేశాని, భవిష్యత్తులోనూ అదే విధంగా పార్టీ విజయానికి సహకరిస్తానని వెన్నా చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, పార్టీ నాయకులు బట్టగిరి గోపి, గాయం రామకృష్ణారెడ్డి, బొందలపాడు సర్పంచ్ వెంకటేశ్వరరెడ్డి, కొనకనమిట్ల మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, నెహ్రూ యువ కేంద్రం మాజీ కన్వీనర్ గొలమారి శ్రీనివాసరెడ్డి, పలువురు మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అన్నా రాంబాబుకు సన్మానం



అన్నా రాంబాబును సన్మానిస్తున్న లక్ష్మీదేవి, కృష్ణారెడ్డి తదితరులు

మార్కాపురం టౌన్: 'నేను ప్రజా సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నా. జగనన్న ఆదేశాలతో మార్కాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నా. మీరందరూ సహకరించాల'ని ఎమ్మెల్యే అన్నా రాంబాబు మార్కాపురం మండల ప్రజా ప్రతినిధులను కోరారు. జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, తిప్పాయిపాలెం ఎంపీటీసీ బండి లక్ష్మీదేవి, ఏఎంసీ మాజీ చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, పార్టీ నాయకులు సవ్వాని వెంకటేశ్వర్లు, ఎస్.నారాయణ, బూదాల గురవయ్య, బండి కృష్ణారెడ్డి తదితరులు ఎమ్మెల్యే రాంబాబును ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అర్హులందరికీ జగనన్న సంక్షేమ పథకాలు అందించారనీ, వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయించి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

పొదిలి: విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ఎం.శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 14వ తేదీలోగా ఒకటో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్ కార్డు, కులము, ఆదాయ ధ్రువీకరణ పత్రం, రేషన్‌కార్డు, ఫొటోలతో సమీపంలోని సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. నెట్ సెంటర్ లేదా ఎంఈఓ కార్యాలయంలోనూ దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.